ఎంబీఏ వన్ టైం పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ వన్ టైం పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

బీఈడీ, ఎంఈడీ వన్ టైం చాన్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఈడీ, ఎంఈడీ కోర్సుల వన్ టైం పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఇయర్ వైజ్), బీఈడీ (సెమిస్టర్ వైజ్), ఎంఈడీ (సెమిస్టర్ వైజ్) వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల ఆరవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: వివిధ సైకాలజీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ, ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, పీఎస్సై క్లినికల్ సైకాలజీ మొదటి సంవత్సరం రెగ్యులర్, ప్రొఫెషనల్ డిప్లమా ఇన్ క్లినికల్ సైకాలజీ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 7వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 12వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండొద్దు

- చిరువ్యాపారులకు సూచించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న చిరు వ్యాపారులు

బేగంపేట్, ఫిబ్రవరి 21: రోడ్లపై రాకపోకలు సాగించే ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కల్పించ కుండా తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫుట్‌పాత్ వ్యాపారులకు సూచించారు. రాంగోపాల్‌పేట డివిజన్‌లోని అంజలి థియేటర్, చిత్ర దర్గా పరిసరాలలో ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలను ట్రాఫిక్ పోలీసులు కొద్దిరోజుల క్రితం తొలగించారు. దీంతో వారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి తమ జీవనోపాధి లేకుండా చేస్తే తమ కుటుంబాలు వీధి నపడతాయని వారు తమ ఆవేదనను విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తలసాని జీహెచ్ఎంసీ అధికారులతో పలుమార్లు సమావేశమై ఫుట్‌పాత్ వ్యాపారుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. వారిని ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పర్యటించి పరిస్థితులను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో అంజలి థియేటర్, చిత్ర దర్గా పరిసరాలలో తొలగించిన ఫుట్‌పాత్ వ్యాపారులు తిరిగి వ్యాపారాలు చేసుకునేందుకు అధికారులు అనుమతించారు. దీంతో ఫుట్‌పాత్ వ్యాపారులు శుక్రవారం రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసానిని కలిసి సన్మానించారు. తమకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే తలసానిని కలిసిన వారిలో రాంగోపాల్ పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, ఫుట్‌పాత్ వ్యాపారులు సతీష్, నర్సింగ్ రావు, శంకర్, చిన్న, రాణి, సన్నీ, అనిత తదితరులు ఉన్నారు.

గంగపుత్రులు అన్నిరంగాల్లో రాణించాలి

డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21: గంగపుత్రులు రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాష్ట్ర గంగపుత్ర సంఘం డైరీ ఆవిష్కరణ శుక్రవారం సుందరయ్య కేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ హాజరై ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగపుత్రులు ఐక్యంగా ఉంటూ రాజకీయంతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. సంఘ అధ్యక్షుడు మెట్టు ధనరాజ్, జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గంగాధర్, సంఘం నాయకులు పాల్గొన్నారు..

జేఎన్టీయూ నూతన వీసీకి అభినందనలు

జేఎన్టీయూ వీసీని అభినందిస్తున్న ఓయూ విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ కిషన్ కుమార్‌రెడ్డి జేఎన్టీయూ నూతన వీసీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విద్యార్థి నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యార్థులు కొమ్ము శేఖర్ మాదిగ, వలిగొండ నరసింహ, మామిడాల రవి కుమార్, దుప్పల్లి అనిల్, చౌట గణేష్, రాజు, కూరపాటి చందు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లో మార్పు చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకులతో మాట్లాడుతున్న వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్డీ ప్రవేశ ప్రక్రియ నోటిఫికేషన్ లో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఓయూ పరిపాలన భవనంలోని వైస్ ఛాన్సలర్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో ఈ మార్పులు తప్పనిసరిగా చేయాలని కోరారు. 65 ఏళ్లనుండి వరకు గైడ్ షిప్ ఇవ్వాలని అన్నారు. రిటైర్ అయిన ప్రొఫెసర్లకు సైతం గైడ్ షిప్ అవకాశం కల్పించాలని కోరారు. పీహెచ్డీ సీట్ల సంఖ్యను కూడా పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. వివిధ రీసెర్చ్ సెంటర్లు, పీజీ సెంటర్ల రిటైర్డ్ ప్రొఫెసర్లకు సైతం గైడ్ షిప్ ను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రవేశ పరీక్షలో ర్యాంకు విధానాన్ని ఎత్తివేసి అర్హత సాధించిన అందర్నీ ఇంటర్వ్యూకు పిలవాలని డిమాండ్ చేశారు.

మాతృభాషను మరువరాదు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు

ముషీరాబాద్ ఫిబ్రవరి 21. విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె ప్రభు సీతాఫల్ మండి డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధిపతి డాక్టర్ కె.సైదులు మాట్లాడుతూ పరాయి భాష నేర్చుకున్నప్పటికీ మాతృ భాషను మరువరాదని అన్నారు. మాతృభాష అమ్మ వంటిదని, దానిని గౌరవించినప్పుడే మానవియ సమాజం రూపొందుతుందని అన్నారు. కళాశాల తెలుగు విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఆర్ రామా దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. లావణ్య, శ్రీనివాస్‌గౌడ్, నీరజ, మల్లికార్జున్, విజయ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభు

పద్మశ్రీ షేక్ నాజర్‌కు నివాళి

షేక్ నాజర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు

ముషీరాబాద్, ఫిబ్రవరి 21: చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధురస్మృతులలో భాగంగా శుక్రవారం బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు హాజరై నాజర్ చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీకృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో చాందిని వంటి ఆడ వేషాలతో నాటక ప్రియులను మెప్పించారన్నారు. పాత్రలోనై జీవం పోసేవారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, పొత్తూరు సుబ్బారావు, వడ్లకొండ వెంకటరావు, వెంపటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ముషీరాబాద్: వంశీ ఇంటర్నేషనల్(ఇండియా) ఆధ్వర్యంలో త్యాగరాయ గాన సభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురిని అలరించింది. గాయకులు రామ కృష్ణ, సురేఖ మూర్తి, ఇందు నయన ఆలపించిన మధుర గీతాలు రంజింప చేశాయి. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు పాల్గొని కళాకారులను సత్కరించారు. ఘంటసాల అవార్డు గ్రహీత దాసరి శ్రీహరి, తెన్నేటి సుధా దేవి, శైలజ సుంకరపల్లి, ఎస్.లలిత, సుధా మయి తదితరులు పాల్గొన్నారు.

రేపటి స్వప్నం కథల సంపుటి ఆవిష్కరణ

కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న గోపరాజు నారాయణరావు

ముషీరాబాద్ ఫిబ్రవరి 21.. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ మాతృ భాషా దినోత్సవం పురస్కరించుకొని జన్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన రేపటి స్వప్నం కథల సంపుటి ఆవిష్కరణ సభ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరిగింది. ముఖ్యఅతిథిగా కథారచయిత గోపరాజు నారాయణరావు హాజరై కథల సంపుటి ఆవిష్కరించారు. ఆచార్య ముదిగొండ శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో త్రోవగుండ వెంకట సుబ్రహ్మణ్యం, డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ, పొత్తూరి సుబ్బారావు, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ దవాఖానలో ముగిసిన శిక్షణ శిబిరం

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 21: గాంధీ వైద్య కళాశాలలోని రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌లో మూడు రోజుల 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ శిక్షణ' శిబిరం శుక్రవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంఈ (అకాడమిక్) డాక్టర్ శివరాంప్రసాద్, శిబిరంలో మూడు రోజుల పాటు పాల్గొన్న వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, బోధనా అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు బోధించే అధ్యాపకులకు నైపుణ్య అభివృద్ధిలో భాగంగా ఎన్ఎంసీ ఆదేశాల మేరకు శిక్షణ ఏర్పాటు చేసిన గాంధీ రీజనల్ సెంటర్ నిర్వాహకులను ఆయన అభినందించారు. 2018లో ఎన్ఎంసీ ప్రవేశపెట్టిన నూతన వైద్య విద్యా విధానంలో ఆధునిక పద్ధతిలో బోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం గాంధీ, కాకతీయ, భాస్కర మెడికల్ కళాశాలలో రీజినల్ శిక్షణ కేంద్రాలు ఉన్నాయని, త్వరలో మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లో కూడా రీజినల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఎన్ఎంసీకి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఈ శిబిరంలో గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర, అదనపు డీఎంఈ, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, గాంధీ రీజనల్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాదల, కో కన్వీనర్ డాక్టర్ సుబోద్‌కుమార్, సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ జలగం తిరుపతిరావు పాల్గొన్నారు.

అలెగ్జాండర్‌కు ఓయూ డాక్టరేట్

అలెగ్జాండర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగంలో పాల శ్రీనివాస్ అలియాస్ అలెగ్జాండర్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ మురళీ కృష్ణ పర్యవేక్షణలో 'యూజ్ ఆఫ్ డిజిటల్ రిసోర్సెస్ ఫర్ రీఎన్వోర్సింగ్ ది ఇంగ్లిష్‌కమ్యూనికేషన్స్ స్కిల్స్ ఆఫ్ లెర్నర్స్ ఎట్ ద టెర్షరీ లెవెల్' అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు పీహెచ్డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి దశలో టీఆర్ఎస్వీ, ఎంఎస్ఎఫ్‌లో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఆత్మగౌరవ ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు, విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

ఇంగ్లిష్ విభాగంలో ఒకరోజు వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఇంగ్లిష్ విభాగంలో 'లాంగ్వేజ్ ఇన్ ద డిజిటల్ ఏజ్: హౌ టెక్నాలజీ షేప్స్ కమ్యూనికేషన్' అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంగు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భాషా అభ్యాసం అనేది కమ్యూనికేషన్‌లో డిజిటల్ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లిష్ విభాగం ప్రొఫెసర్ సవిన్ సౌడ, ప్రొఫెసర్ సావిత్రి, డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్ ఫిబ్రవరి 21 టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ బర్కత్‌పుర బస్సు డిపో, కాచిగూడ రైల్వే స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు బర్కత్‌పుర బస్ డిపో, కాచిగూడ రైల్వే స్టేషన్ ఫీడర్ పరిధిలోని అమృత వర్షిని అపార్ట్‌మెంట్, రాజేంద్రనగర్ కాలనీ, కాచిగూడ రిజర్వేషన్ కాంప్లెక్స్, కాచిగూడ రైల్వేస్టేషన్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ ట్యాంక్ అందజేత

ట్యాప్‌ను ప్రారంభిస్తున్న ఆర్.ఆంజనేయులు, సిబ్బంది

కవాడిగూడ, ఫిబ్రవరి 21: భోలక్‌పూర్ రంగానగర్‌లోని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాజంపేట చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు వాటర్ ట్యాంక్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆసుపత్రికి వచ్చే రోగులకు నీటి సమస్య తలెత్తకుండా వాటర్ ట్యాంకు పై అంతస్తు భవనం నుంచి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి నీటి సరఫరా జరిగేలా చేశామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది లక్ష్మి, నరేష్, విదిత, సాయి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు తగిన ఏర్పాట్లు చేయండి

డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం మైనార్టీ కమిటీ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముస్లిం మైనారిటీ కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడే అవసరమైన ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆస్తి పన్ను సమస్యలపై స్పెషల్ డ్రైవ్

ముషీరాబాద్, ఫిబ్రవరి 21: జీహెచ్ఎంసీ సర్కిల్ -15 పరిధిలో ఆస్తి పన్ను సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22 నుంచి మార్చి 29 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీఎంసీ మారుతీ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండి ఆస్తి పన్ను సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ఆస్తి పన్ను (ట్యాక్స్)అసెస్‌మెంట్, అభ్యర్థనల స్వీకరణ, సవరణలు, కోర్టు కేసులో ఉన్న ట్యాక్స్ సంబంధించి ఏమైనా సమస్యలు, ఆర్టీజీఎస్ ద్వారా చేసిన చెల్లింపుల సవరణలు, ఆన్‌లైన్ బకాయిలు తదితర సమస్యలు ఉంటే నేరుగా సర్కిల్ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

బేగంపేట్: ఆస్తిపన్ను, ప్రాపర్టీ టాక్స్ సమస్యల పరిష్కారం కోసం ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం పీటీపీ కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి మార్చి 29 వరకు ప్రతి శనివారం బేగంపేట్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు డిప్యూటీ కమిషనర్ వి.సమ్మయ్య తెలిపారు. శుక్రవారం ఆయన సర్కిల్ కార్యాలయంలో మాట్లాడారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆస్తి పన్ను సమస్యలు పున సమీక్ష అభ్యర్థనలు ఆస్తి పన్ను సవరణలు కోర్టు కేసెస్ టాక్స్‌కు సంబంధించిన ఏ సమస్య అయినా బేగంపేట సర్కిల్ కార్యాలయానికి వచ్చి తెలుపగలరని సూచించారు. ప్రాపర్టీ టాక్స్ పరిష్కార కార్యక్రమం ఈ నెల 22 నుంచి మార్చి 1, 8, 15, 22 , 29 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు చేయొచ్చని ఆయన తెలిపారు

లో ప్రెషర్ సరఫరా సమస్యను పరిష్కరించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21: గాంధీనగర్ డివిజన్ నెలకొన్న మంచినీటి లోప్రెషర్ సరఫరా సమస్యను పరిష్కరించాలని డివిజన్ కార్పొరేటర్ పావని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కోరారు. శుక్రవారం కార్పొరేటర్ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె డివిజన్‌లో నెలకొన్న మంచినీటి సమస్యలను అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చాలా కాలంగా గాంధీనగర్ డివిజన్‌లోని ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న మంచినీటి సరఫరా లోప్రెషర్ సమస్యను పరిష్కరించడంలో వాటర్ వర్క్స్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. డివిజన్‌లో నెలకొన్న మంచినీటి లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తుకారాం గేట్ సీఐ శంకర్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 21: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని తుకారాం గేట్ సీఐ శంకర్ తెలిపారు. శుక్రవారం తుకారం గేట్ లోని శిరిడి సాయిబాబా హై స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుకారం గేట్ సీఐ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై సైబర్ క్రైమ్, ఇతర నేరాలపై విద్యార్థులకు అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు కాకుండా ఉన్నతమైన విద్యను అభ్యసించాలని ఆయన సూచించారు. విద్యార్థి దశ నుండే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తుకారం గేట్ ఎస్సై దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

బీఐఎస్ వాటర్ క్వాలిటీ సభ్యురాలుగా డాక్టర్ సయీదా

డాక్టర్ సయీదా అజీమున్నీసా

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతిష్టాత్మక బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) వాటర్ క్వాలిటీ కమిటీ సభ్యురాలిగా డాక్టర్ సయీదా అజీమున్నీసా నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం ఓయూ ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్పర్సన్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

హోటల్ సిబ్బందిపై దాడి

ఉస్మానియా యూనివర్సిటీ: బిర్యానీకి డబ్బులు అడిగారని హోటల్ సిబ్బందిపై ఓ దుండగులు దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన లాలాగూడలోని సూపర్‌స్టార్ హోటల్‌లో చోటు చేసుకుంది. లాలాగూడ పోలీసుల వివరాల ప్రకారం గురువారం రాత్రి ఓ దుండగుడు వచ్చి బిర్యానీ అడగగా, సిబ్బంది డబ్బులు అడిగారు. దీంతో ఆగ్రహించిన అతడు రాడ్డుతో హోటల్ ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు సిబ్బందిపై దాడికి దిగాడు. హోటల్ సిబ్బందికి తీవ్ర గాయాలవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

24న చలో ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: అశాస్త్రీయంగా పెంచిన పరీక్ష ఫీజులను నిరసిస్తూ ఈ నెల 24న చలో ఉస్మానియా యూనివర్సిటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏబీవీపీ హైదరాబాద్ నగర కార్యదర్శి పృథ్వీ తేజ తెలిపారు. పరీక్ష ఫీజులను విచ్చలవిడిగా పెంచి విద్యార్థుల దగ్గర బలవంతంగా వసూలు చేయడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రైవేటు యూనివర్సిటీలను తలదన్నేలా ఫీజులు ఉండడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

PUBLIC NOTICE

This is to inform the general public that Amarchand Srisrimal and Priyanka Singhvi are the owner of Eastern Part of House No. 5-2-254/1 (Forming Part of H.No. 5-2-254) on Part of Plot No. 88, Land admeasuring 35.18 Sq.yds. out of 91.18 Sq.yds., situated at Hyderbasti, Secunderabad who acquired the same vide Registered Sale Deed No. 134/2022, Dated 24-01-2022.

Whoever has got any claims or rights over the above mentioned property, please Contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 7 days from date of publication of this notice.